సంపుటి :02 సంచిక :219 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

సోమవారం 27 , అక్టోబర్ 2025

# పత్తి రైతులకు అండగా ప్రభుత్వం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఏనుమాముల మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

02



# లక్కు కిక్కెవరికో తేలింది !





## ఉమ్మడి జిల్లాలో ముగిసిన లాటరీ ప్రక్రియ

- 294 మద్యం షాపులకు కలెక్టర్ల ఆధ్వర్యంలో లక్కీ డ్రా
- రిజర్వేషన్లు, ఓపెన్ టెండర్ల వారీగా నిర్వహణ
- కోటా ప్రకారం షాపులు దక్కించుకున్న గౌడ, ఎస్టీ, ఎస్సీలు
- డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం షాపులు

02

మద్యం షాపుల దక్కించుకున్న అదృష్టవంతులు అదే ‘కిక్కు’తో లక్షలు సంపాదించేదెవరో తేలిపోయింది. రూ.3 లక్షల ఫీజు భారీదే అయినా, ముందు వెనుకా ఆలోచించి, చివరకు పెట్టిన సొమ్ము పోతేపోయిందని, ధైర్యం చేసి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి టెండర్లు వేసిన 294 మంది లక్కు ఫలించింది. మిగతావారికి నిరాశే అయినా, లాటరీ దక్కించుకున్న వారికి మాత్రమే ఇది పండుగ రోజు. జిల్లాల పరిధిలో సోమవారం ఉదయం 11 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభమైంది. రిజర్వేషన్ల ప్రకారం ఎక్సైజ్ అధికారులు, లాటరీ తీసి షాపు యజమానులెవరో తేల్చారు. కొత్తగా వైన్ షాపులు దక్కించుకున్న వారు డిసెంబర్ 1వ తేదీ నుంచి తమ వ్యాపారం ప్రారంభించనున్నారు.- అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి





# కోటగుళ్లకు కార్తీక శోభ

## తొలి సోమవారం పోటెత్తిన భక్తులు

- గణపతి నందీశ్వరుడు గణపేశ్వరునికి రుద్రాభిషేకం
- స్వామివారికి పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ
- తులసి, ఉసిరికోటల వద్ద దీపాలు వెలిగించిన మహిళలు

02



## ప్రైవేటుకు దీటుగా

# ప్రభుత్వ స్కూళ్లు

- బాలికలు ఉన్నత చదువులు చదవాలి
- బాలికల కోసమే కస్తూరిబా గాంధీ విద్యాలయాల ఏర్పాటు
- పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

# కోటగుల్లకు కార్తీక శోభ

- తొలి సోమవారం పోటెత్తిన భక్తులు
- గణపతి నందీశ్వరుడు గణపేశ్వరునికి రుద్రాభిషేకం
- స్వామివారికి పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ
- తులసి, ఉసిరికోటల వద్ద దీపాలు వెలిగించిన మహిళలు

అక్షరదర్బార్, గణపురం: కార్తీక మాసం తొలి సోమవారం కోటగుళ్లకు కొత్త శోభ సంతరించుకుంది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. ఉదయం గణపతి పూజతో కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నందీశ్వరునికి గణపేశ్వరునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అభిషేకం అనంతరం పూలమాలలో పట్టు వస్త్రాలతో స్వామివారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్తీక మాసం తొలి సోమవార పర్వదినం కావడంతో వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజాలు నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు తులసి ఉసిరి కోటల వద్ద కార్తీకదీపాలను వెలిగించి అనంతరం దీప దానాలు చేశారు. ఈ సందర్భంగా కోటగుళ్ల దేవాలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు భక్తులకు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలు మహిళలకు అమ్మవారి గాజులను అందజేశారు.








# లక్కు కిక్కెవరికో తేలింది !

- ఉమ్మడి జిల్లాలో ముగిసిన లాటరీ ప్రక్రియ
- 294 మద్యం షాపులకు కలెక్టర్ల ఆధ్వర్యంలో లక్కీ డ్రా
- రిజర్వేషన్లు, ఓపెన్ టెండర్ల వారీగా నిర్వహణ
- కోటా ప్రకారం షాపులు దక్కించుకున్న గౌడ, ఎస్టీ, ఎస్సీలు
- డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి:**

వైన్ షాపుల టెండర్లు దక్కించుకున్న అదృష్టవంతులెవరో తేలిపోయింది. వచ్చే రెండేళ్ల కోసం మద్యం దుకాణాలను నిర్వహించే అవకాశం ఉన్న వారి భవిష్యత్తు తెలిపింది. ఉమ్మడి జిల్లాలోని 294 వైన్‌షాపులకు గాను 10,493 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో గౌడ కులస్తులకు కేటాయించిన దుకాణాలకు 2,050 దరఖాస్తులు, ఎస్సీ రిజర్వుడ్ దుకాణాలకు 1,023, ఎస్టీ రిజ◌ర్◌డ్ దుకాణాలకు 651, ఓపెన్ టెండర్లకు 6,769 దరఖాస్తులు అందాయి. రిజర్వేషన్లు, ఓపెన్ టెండర్ల ప్రకారం ఎక్సైజ్ అధికారులు లాటరీ ప్రక్రియ నిర్వహించారు. రిజర్వేషన్ల ప్రకారం ఎక్సైజ్ అధికారులు, లాటరీ తీసి షాపు యజమానులెవరో తేల్చారు.

## - ఉమ్మడి జిల్లాలో ప్రక్రియ ఇలా..

వరంగల్ రూరల్ జిల్లా ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 57 మద్యం షాపులు ఉండగా, వాటికి 1,958 దరఖాస్తులు వచ్చాయి. వీటికి వరంగల్ ఉర్సు గుట్ట సమీపంలోని నాని గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి సమక్షంలో లాటరీ ప్రక్రియ జరిగింది. హనుమకొండ జిల్లా పరిధిలో 67 మద్యం షాపులు ఉండగా, హనుమకొండ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో కలెక్టర్ స్నేహ శబరీశ్ ఆధ్వర్యంలో ప్రక్రియ జరిగింది. వరంగల్ అర్బన్ లో పరిధిలో 67 వైన్స్ షాపులకు 3,175 దరఖాస్తులు రాగా కలెక్టర్ స్నేహ శబరీశ్ ఆధ్వర్యంలో ప్రక్రియ జరిగింది. మహబూబాబాద్ జిల్లా పరిధిలో 61 వైన్ షాపులకు ఉండగా, 1,800 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ అద్వైత్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో లాటరీ ప్రక్రియ జరిగింది. జనగామ జిల్లాలో 50 మద్యం దుకాణాలు ఉండగా, 1,697 దరఖాస్తులు వచ్చాయి. వాటి కేటాయింపునకు జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేటు స్థలంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ జరిగింది. భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలో రెండూ ఒకే యూనిట్ కాగా, వీటి పరిధిలో 59 మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటిని దక్కించుకునేందుకు మొత్తం 1,863 దరఖాస్తులు వచ్చాయి. భూపాలపల్లి పట్టణంలోని మంజూరు నగర్ ఇల్లెందు క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ సమక్షంలో లాటరీ ప్రక్రియ జరిగింది.

## ప్రభుత్వానికి ఆదాయం

**2023 25 టెండర్లతో పోలిస్తే ఈసారి దరఖాస్తులు భారీగా తగ్గాయి. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచినా ఆదాయం రాకపోవడం గమనార్హం. గత టెండర్ల సందర్భంగా ఉమ్మడి వరంగల్ లో 294 షాపులకు 16,039 దరఖాస్తులు రాగా, ప్రభుత్వానికి రూ.320.78 కోట్లు ఆదాయం వచ్చింది. ఈసారి అదేస్థాయిలో.. అంతకంటే ఎక్కువ కూడా దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. దీంతో అదనంగా పెరిగిన అప్లికేషన్ ఫీజు రూ.లక్ష కలిపి దరఖాస్తుల ద్వారా రూ.481 కోట్ల నుంచి రూ.520 కోట్ల వరకు రావొచ్చనుకున్నారు. కానీ, ఈసారి ఆశించిన మేర స్పందన లేక గడువు పొడిగించినప్పటికీ గతంతో పోలిస్తే 5,546 తక్కువ వచ్చాయి. మొత్తం 10,493 దరఖాస్తులు రాగా.. వాటిపై రూ.314.79 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది.**

## - డిసెంబర్ 1 నుంచి కొత్త షాపులు

డిసెంబర్ 1వ తేదీ నుంచి తెలంగాణవ్యాప్తంగా కొత్త వైన్స్ షాపుల నిర్వహణ కొనసాగనుంది. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో మద్యం షాపులు దక్కించుకునేందుకు కొందరు సిండికేటై టెండర్లు వేశారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారంపై విపక్షాలు ప్రతికూల ప్రచారం చేస్తుండటంతో యువకులు, వ్యాపారులు మద్యం వ్యాపారంపై ఆసక్తి చూపారు పలుచోట్ల నలుగురు, ఐదుగురు గ్రూప్‌గా ఏర్పడి ఎక్కవగా దరఖాస్తులు వేశారు. గ్రూపుగా కావడంతో పాటు ఫీజు పెంపు కారణంగా దరఖాస్తులు తగ్గినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఒక్కో దరఖాస్తుకు ప్రభుత్వం రూ.3లక్షలు ఫీజు పెట్టిన విషయం తెలిసిందే. ఎంపికైన దరఖాస్తుదారులు అదే రోజు గానీ, మరుసటి రోజు గానీ, షాప్ ఎక్సైజ్ పన్ను మొదటి వాయిదాను చెల్లించి షాపు కేటాయింపు నిర్ధారణ లేఖ తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# పత్తి రైతులకు అండగా ప్రభుత్వం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఏనుమాముల మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

అక్షరదర్బార్, వరంగల్: పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డ్ లో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కోసం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేంద్రాన్ని సోమవారం మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్దదైన వరంగల్ వ్యవసాయ మార్కెట్ లో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించుకోవడం సంతోషదాయకమన్నారు. ఏనుమాముల మార్కెట్ కు వచ్చిన పత్తి బస్తాను కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. తేమ వల్ల రైతులు నష్టపోకుండా కమిటీని వేసినట్లు తెలిపారు.

## ఐదు రోజుల్లోనే అకౌంట్ లో డబ్బులు

పత్తి విక్రయించిన మూడు నుంచి ఐదు రోజుల్లోనే సంబంధిత రైతు బ్యాంక్ అకౌంట్ కు నేరుగా డబ్బులు జమవుతాయన్నారు. రైతుల సంక్షేమం కోసం రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రైతు రుణమాఫీ చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని, వడ్లు కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులకు డబ్బులు జమ అవుతున్నాయని అన్నారు. తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టాలని చూస్తే ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. వ్యవసాయ అధికారుల వద్ద తేమ యంత్రాలు ఉన్నాయని, రైతుల పొలాల వద్దనే తేమ శాతం పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్దతు ధర రూ.8110 కల్పించడం జరిగిందని, తేమ 8 శాతానికి మించ కూడదని, ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టుకుని నాణ్యతగా పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని ఆయా మిల్లులకు కేటాయించిన తేదీల్లో అమ్ముకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800 5995779, వాట్సప్ నెంబర్ 889728 1111 కు సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏనుమాముల మార్కెట్ యార్డులో సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు.



# నాలుగు రోజులు.. అతి భారీ వర్షాలు

## - ఉమ్మడి జిల్లాపై మోంథా తుపాన్ ఎఫెక్ట్

అక్షరదర్బార్, హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మోంథా తుపానుగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణవ్యాప్తంగా నాలుగు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ప్రకటన ప్రకారం.. సోమవారం మహబూబాబాద్ జిల్లాలో పలు చోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. బుధవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడా అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. గురు, శుక్రవారాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# గ్రామానికి కైలాస రథం, బాడీ ఫ్రీజర్ బహూకరణ

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి దాతలు, బాల్య మిత్రులు, గ్రామ పెద్దలు సంయుక్తంగా కైలాస రథం, డెడ్ బాడీ ఫ్రీజర్ బాక్స్ ను బహూకరించారు. ఈ పరికరాలను గ్రామ కార్యదర్శి శ్రీకాంత్‌కు ప్రజల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామ అభివృద్ధికి తోడ్పడతాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో తోటి సుదర్శన్, బండారి రాజేశ్వరి, ముప్పిడి కృష్ణార్జున రెడ్డి, మార్త బిక్షపతి, అనంతుల సారంగపాణి, బుద్దే సదానందం, బొమ్మకంటి సాంబయ్య, గుర్రం అశోక్, బత్తిని సత్యనారాయణ, బొమ్మకంటి ముత్యాలు, నాగరాజు, సముద్రాల లింగమూర్తి, రాజేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేను కలిసిన నడికూడ ఎంపీడీఓ



అక్షరదర్బార్, పరకాల : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని హనుమకొండలోని భవానీనగర్ నివాసంలో నడికూడ ఎంపీడీఓ రామ రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎమ్మెల్యేకు మొక్కను బహుకరించి, శాలువాతో సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో గోవింద నవీన్ కుమార్ పాల్గొన్నారు.



# పరకాలను మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతా

## : ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

అక్షరదర్బార్, పరకాల : పరకాల పట్టణాన్ని ఆధునిక సౌకర్యాలతో మోడల్ టౌన్‌గా మార్చే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. సోమవారం పరకాల క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. గత పాలకుల కాలంలో వ్యక్తిగత ప్రాధాన్యతతో పనులు జరిగితే, ప్రస్తుతం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

### రూ.63 కోట్లతో అభివృద్ధి పనులు

పట్టణంలో రూ.63 కోట్ల విలువైన పనులు చేపట్టారని తెలిపారు. ఆరు జోన్లుగా విభజించి మూడు



జోన్లలో 15 కోట్ల పనులు ప్రారంభించగా, రెండో దశలో 8.75 కోట్ల పనులు కొనసాగుతున్నాయని, మరో 15 కోట్ల టెండర్లు పిలిపించామని చెప్పారు.

### మంచినీటి ప్రాజెక్ట్ కు రూ.32 కోట్లు

చలివాగు ప్రాజెక్ట్ ద్వారా పరకాల మరియు కామరెడ్డి పల్లెలకు తాగునీటి సరఫరా కోసం 32 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు.

### విద్యా రంగం అభివృద్ధి దిశగా

స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఐటీఐ, డిగ్రీ కాలేజ్ పనులు వేగంగా సాగుతున్నాయని, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను డిసెంబర్‌లో ప్రారంభిస్తామని తెలిపారు. విద్యా రంగం పరకాల భవిష్యత్తు రూపురేఖలను మార్చుతుందన్నారు.

### ఇండోర్ స్టేడియం ప్రణాళిక

ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఇండోర్ స్టేడియంగా మారుస్తూ యువతకు క్రీడా సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను వినియోగించి కార్యాలయాల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. సుష్మ, సీఐ వి. క్రాంతి కుమార్, కాంగ్రెస్ నాయకులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# పండ్ల వ్యాపారుల ఇష్టారాజ్యం

- దర్జాగా రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని ప్రధాన రహదారులు ఇప్పుడు పండ్ల మార్కెట్లుగా మారిపోయాయి. రోడ్ల పక్కన క్రమం తప్పకుండా దుకాణాలు పెట్టి పండ్లు అమ్ముతున్న వ్యాపారులు, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. వాహనాలు ఇరుక్కుపోవడం, పశువులు తిరుగడం, ట్రాఫిక్ జామ్‌లు సాధారణమైపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు పలు మార్లు ఫిర్యాదులు చేసినా, అధికారులు మాత్రం కనీసం స్పందించడం లేదు. దీనిపై స్థానికులు "రోడ్లపైనే అక్రమ వ్యాపారాలు సాగుతున్నా అధికారులకు కనబడడంలేదా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న పండ్ల వ్యాపారులపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. "పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పారదర్శక పాలనకు కట్టుబడి ఉన్నామంటున్నారు. అయితే ఇంత పెద్ద స్థాయిలో జరుగుతున్న అక్రమాలపై స్థానిక అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### ప్రత్యేక స్థలం కేటాయించాలి

ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న పండ్ల వ్యాపారాలను వెంటనే రోడ్లపై నుంచి తొలగించాలని, మార్కెట్‌కు ప్రత్యేక స్థలం కేటాయించి అక్కడే వ్యాపారాలు సాగేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులు, మున్సిపల్ శాఖలను కోరుతున్నారు.





# నూతన వధూవరులకు నాగూర్ల ఆశీర్వాదాలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల నియోజకవర్గం ధర్మారం గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షులు సందెల సునీల్ కుమార్ కుమారుడు సాయికిరణ్– సాగరిక వివాహ వేడుకకు తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట అరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శెట్టిపల్లి శివాజీ, ఉద్యమకారుడు బాబుమియా పాల్గొన్నారు.

# మొట్లపల్లిలో విషాదం

## ఒకేరోజు ఇద్దరు వృద్ధులు మృతి

అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలో ఒకేరోజు ఇద్దరు వృద్ధులు మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన తోకల రాజమ్మ (85) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. అదే గ్రామానికి చెందిన వడ్డేపల్లి రాజయ్య (85) అనారోగ్యంతో బాధపడుతూ ఉదయం 11 గంటలకు కన్నుమూశారు. ఒకేరోజు ఇద్దరు వృద్ధుల మరణం గ్రామాన్ని విషాదంలో ముంచేసింది. మృతుల కుటుంబాలకు గ్రామస్తులు సానుభూతి తెలిపారు.

# సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే లక్ష్యం: సీపీఐ

అక్షర దర్బార్, హనుమకొండ: దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూ సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్.ఎ. స్టాలిన్ అన్నారు. రామారంలో గుడిసెల కేంద్రం వద్ద సీపీఐ సమావేశంలో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు బీజేపీనే ప్రధాన అడ్డంకని ఆయన విమర్శించారు. బీసీ రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్లో చేర్చి చట్టసవరణ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇండ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గుడిసెల్లో నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసి



ఇందిరమ్మ ఇళ్లు కట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దామెర సుదర్శన్, పొక్కుల సదానందం, రాగల ప్రభాకర్, గోల్కొండ సారయ్య, భోగం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# పెండెం కట్టయ్య సేవలు చిరస్మరణీయం

## : పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట: కరుడుగట్టిన కాంగ్రెస్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు పెండెం కట్టయ్య సేవలు చిరస్మరణీయమని పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెండెం కట్టయ్య 28వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కట్టయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంజిత్ రెడ్డి మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కట్టయ్య గారు జీవితాంతం కృషి చేశారని తెలిపారు. ఆయన



ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పెండెం రామానంద్, బత్తిని రాజేందర్, ఎడ్ల జగన్మోహన్ రెడ్డి, ఓర్సు తిరుపతి, ఎర్ర యాకుబ్ రెడ్డి, శాఖమూరి హరిబాబు, తుమ్మలపెల్లి సందీప్, మాదాసి రవి, పంబి వంశీకృష్ణ, బైరి మురళీ, ఆడెపు రమాదేవి, ధోని కీర్తన పాల్గొన్నారు.



# కూలీలు, హమాలీల కూలీ రేట్లు పెంచాలి

**ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న**

అక్షరదర్బార్, కేసముద్రం : హమాలీ, కూలీల కూలీ రేట్లను వెంటనే పెంచాలని ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా రేట్లు పెరగకపోవడం వల్ల హమాలీల జీవనోపాధి ఇబ్బందికరంగా మారిందని వాపోయారు. ప్రస్తుతం బస్తాకు కేవలం 18 నుంచి 50 పైసలు మాత్రమే ఇస్తున్నారని, పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని బస్తాకు ₹25 చొప్పున చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సకినాల నరేష్, బట్టు మురళి, కొమ్ము అనిల్, శ్రీను పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు రితిక

అక్షరదర్బార్, పరకాల : పరకాల పట్టణానికి చెందిన పోచంపల్లి రితిక రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు ఎంపికైంది. హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి ఎంపికల్లో రితిక అద్భుత ప్రతిభ కనబరచింది. అండర్–19, 56 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత సాధించింది.



డిసెంబర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనుందని క్రియేటివ్ కరాటే డూ వ్యవస్థాపకులు మాడ సంపత్ తెలిపారు. రితిక విజయంపై మాస్టర్ పాపయ్యతో పాటు పలువురు అభినందనలు తెలిపారు.



# ఇసుక అక్రమ రవాణా

అక్షరదర్బార్, మరిపెడ : మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ మండలాల్లో ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట లేకుండా సాగుతోంది. ఆకేరువాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మౌనం వహిస్తున్నారు. అధికార పార్టీ నేతల సహకారంతో ట్రాక్టర్లు పట్టపగలే ఇసుక తరలిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మైనర్లు నడిపే నంబర్లు లేని ట్రాక్టర్ల వల్ల ప్రమాదాల భయం పెరుగుతోంది. అధికారుల నిఘా లేకపోవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# వీవోఏలపై సీసీల వేధింపులు ఆరికట్టాలి

**సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి మల్లేష్**

అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల మండలంలోని శ్రీ మహాలక్ష్మి మహిళా సంఘంలో విధులు నిర్వహిస్తున్న 36 మంది వీవోఏలను మానసికంగా వేధిస్తున్న సీసీలను తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీఐ ఎంఎల్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వీవోఏల ప్రతినిధులతో కలిసి మల్లేష్ మాట్లాడుతూ.. సీసీలు తప్పుడు ఆరోపణలతో, దురుసు ప్రవర్తనతో వీవోఏలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారి లాగిన్‌లను బ్లాక్ చేసి జీతాలు నిలిపేస్తున్నారని ఆరోపించారు. వెంటనే సీసీలను సస్పెండ్ చేసి, వీవోఏలకు న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పీడీపై కూడా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మండల కార్యదర్శి బుర్రి కుమారస్వామి, వీవోఏల మండల అధ్యక్షురాలు కొాముర‌వెల్లి రజిత, కార్యదర్శి కోడూరి ఓంకార్, కోశాధికారి రామ్ కోమలత, సహాయ కార్యదర్శి కొత్తూరి సాలన్న, రుక్మాబాయి, జ్యోతి, సుగుణ, శ్వేత, రాజేశ్వరి, రజిత,



సంధ్య, స్రవంతి, రమేష్, రామస్వామి, శ్యాము తదితరులు పాల్గొన్నారు.



## పారదర్శకంగా
# మద్యం షాపుల ఎంపిక

- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో మొత్తం 59 షాపులకు 57 షాపుల డ్రా
- ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్



అక్షరదర్బార్, భూపాలపల్లి క్రైమ్ : 2025–27 సంవత్సరాలకు గానూ మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియను జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌లో లాటరీ పద్ధతిలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మొత్తం 59 మద్యం దుకాణాల ఎంపికకు డ్రా నిర్వహించగా, అందులో 57 దుకాణాల ఎంపిక వీడియోగ్రఫీ సమక్షంలో పారదర్శకంగా పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. గెజిట్ నంబర్ 49 చల్వాయి గ్రామం, 50 గోవిందరావుపేట దుకాణాల లక్కీ డ్రా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు వాయిదా వేయబడింది. షాపు నంబర్ 40కు అత్యధికంగా 77 దరఖాస్తులు రాగా, డ్రా ద్వారా 46 నంబర్ దుకాణం ఎంపికైంది. కార్యక్రమంలో ఎక్సైజ్ ఈఎస్ఎస్ శ్రీనివాస్, డీఎస్పీ సంపత్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా గౌస్ ఏ ఆజమ్ జెండా పండుగ

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో ఆదివారం గ్యార్వి షరీఫ్ గౌసె ఆజమ్ జెండా పండుగను ముస్లిం పెద్దలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో గౌసె ఆజమ్ జెండాను ఊరేగించారు. ఈ ఊరేగింపులో మతపెద్దలు, ముస్లింలు, స్థానిక ప్రజలు భారీగా పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, దేశంలో శాంతి, ఐకమత్యం నెలకొనాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా మతపెద్దలు గౌస్ ఏ ఆజమ్ సద్గుణాలను స్మరించారు.

## నిర్భయంగా పోలీసు సేవలను
# వినియోగించుకోవాలి

**: ఎస్పీ కిరణ్ ఖరే**



అక్షరదర్బార్, భూపాలపల్లి క్రైమ్ : ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. సోమవారం ప్రజా దివాస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అందిన 10 ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు జారీ చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ సంబంధిత సీఐలు, ఎస్ఐలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ, "ప్రజలకు చట్టబద్ధంగా న్యాయం అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం. శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువ కావడానికి ప్రయత్నిస్తున్నాం" అని పేర్కొన్నారు.

# సాధనపల్లిలో పశువైద్య శిబిరం

అక్షర దర్బార్, శాయంపేట: సాధనపల్లి గ్రామంలో పశువైద్యాధికారి ఎం.సునిల్, ప్రజ్వాల్ సంస్థ సంయుక్తంగా పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 125 తెల్లజాతి, 80 నల్లజాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు ముందుగానే టీకాలు వేయించి పశువులను రక్షించుకోవాలని ప్రాజెక్ట్ మేనేజర్ జి.మానస సూచించారు. శిబిరంలో పశువైద్య సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.



# ఇది హాస్పిటలేనా?

- వసతులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే గండ్ర
- భూపాలపల్లి జనరల్ ఆసుపత్రిని సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు



అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సోమవారం పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశీలించిన ఆయన, అపరిశుభ్రత, చెత్త పెరుకుపోవడం, టాయిలెట్స్ దుర్వాసనతో నిండిపోవడం వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇది హాస్పిటలేనా?" అని ప్రశ్నించిన గండ్ర, మహిళలతో దురుసుగా ప్రవర్తిస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజలతో సున్నితంగా వ్యవహరించాలని, రోగుల సమస్యలు వినాలి" అని సూచించారు. సిటి స్కాన్ యంత్రం నెలలుగా ప్రారంభం కాకపోవడం, గర్భిణీలు గంటల తరబడి క్యూలో నిలబడి నమోదు చేసుకోవడం, కూర్చునే సదుపాయం లేకపోవడం వంటి అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "అర్భాటాలతో ప్రారంభోత్సవాలు చేయడం కాదు, మంత్రి ఒకసారి రివ్యూ పెడితే వంద సమస్యలు పరిష్కారమవుతాయి" అని ఆయన పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ లో చేరిన అడ్వకేట్ మంత్రి రాకేష్**

భూపాలపల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అడ్వకేట్ మంత్రి రాకేష్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలి

## అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



అక్షర దర్బార్, భూపాలపల్లి: జిల్లా ప్రజావాణిలో వచ్చిన 36 ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులు ఆదేశించారు. ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

# రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కల తొలగింపు

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలోని సూరంపేట–మందరిపేట రహదారిపై దట్టంగా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు రాకపోకలకు అంతరాయం కలిగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల భద్రతను దృష్టిలో పెట్టుకొని శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్ పర్యవేక్షణలో చెట్లను తొలగించే పనులు చేపట్టారు. ఈ చర్యతో రహదారిపై ప్రయాణించే ప్రజలకు ఉపశమనం లభించింది.





# గ్రేటర్ ప్రెస్ క్లబ్ లో సంబురాలు

- హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో తమ ప్యానెల్ అభ్యర్థుల గెలుపుపై హర్షం వ్యక్తం చేసిన ఐజేయూ నాయకులు
- బాణసంచా కాల్చి స్వీట్లు పంచిన నేతలు




అక్షరదర్బార్, హనుమకొండ: హోరా హోరీగా జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ ఎన్నికల్లో టీయుడబ్ల్యూజే మద్దతుతో పోటీ చేసిన ఫ్రెండ్స్ ప్యానెల్ అఖండ మెజారిటీతో ఘన విజయం సాధించింది. దీంతో హనుమకొండ బాలసముద్రం లోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర, జిల్లా నాయకులు, ప్రెస్ క్లబ్ బాధ్యులు సంబురాలు జరుపుకున్నారు. ప్రెస్ క్లబ్ ఆవరణలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసుకుని హైదరాబాద్ లో ఐజేయూ విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం మీడియా అకాడమీ ఛైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కే విరాహత్ అలీ, రానాంరాయణల నాయకత్వానికి దక్కిన గౌరవమని కొనియాడారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజేరాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ మాట్లాడుతూ హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఐజేయూ ఘన విజయానికి ఎంతో కృషి చేసి ప్యానల్ ను గెలిపించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో విషసర్పాలన్నీ ఏకమై, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, చారిత్రాత్మక తీర్పుతో చెంపపెట్టు లాంటి సమాధానం చెప్పి, ఫ్రెండ్స్ ప్యానెల్ మొత్తాన్ని అనూహ్య మెజారిటీతో గెలిపించిన హైదరాబాద్ జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, టీయూడబ్ల్యూజేరాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, పెండెం వేణుమాధవ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు పివి మదన్ మోహన్, గడ్డం కేశవ మూర్తి, పిన్నా శివ కుమార్, యూనియన్ నాయకులు కెంచ కుమారస్వామి, మాదం రజినీకుమార్, డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, సాయిరాం, యాంసాని శ్రీనివాస్, మంచాల రాజు, ముదిగిరి ఓదెలు, అల్లె రామారావు, రామ్మోహన్, సంపతి ప్రభాకర్, తాండూరి గోపి, కొమ్మాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో కొత్త ట్విస్ట్

- ఎమ్మెల్యేలకూ డీసీసీ పదవులు
- చర్చనీయాంశంగా పీసీసీ చీఫ్ మహేశ్ వ్యాఖ్యలు
- పార్టీ కోసం పనిచేసిన కుటుంబాల్లో ఒకరికి మించి పదవులివ్వొచ్చని స్పష్టీకరణ
- డీసీసీ పదవులకు ఎమ్మెల్యేలు సమర్థులైతే ఇస్తామని ప్రకటన




అక్షరదర్బార్, హైదరాబాద్: జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష (డీసీసీ) పదవులకు ఎమ్మెల్యేలు సైతం పోటీ పడుతున్నారని ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఖ్యానించడం రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. ఈ వ్యాఖ్యలతో నిన్నమొన్నటి వరకు ఇప్పటికే పదవులు ఉన్న వారికి పదవులు అప్పగించమని, ఐదేళ్ల పాటు పార్టీలో నిరంతరాయంగా కొనసాగిన వారికే పదవులు ఉంటాయన్న అధిష్ఠానం.. ఇప్పుడా ఆ విషయంలో యూ టర్న్ తీసుకోనుందా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఒకే కుటుంబంలో ఒక్కరికి మించి పార్టీ పదవులు ఉండవని కూడా పార్టీ పెద్దలు ఇటీవల పకటించ◌ారు. దీనిపైనా పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శతాబ్దాల తరబడి పార్టీ సేవకు చేస్తున్న కుటుంబాలు తెలంగాణలో ఎన్నో ఉన్నాయని, ఆయా కుటుంబాలను ఉదాహరిస్తూ, కూడా పీసీసీ చీఫ్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## - పీసీసీ చీఫ్ ఏమన్నారంటే..

జిల్లాల్లో స్థానిక పరిస్థితులను బట్టి వారికి ఆ పదవులు వచ్చే అవకాశం ఉంటుంది. ఇతర పదవుల్లో ఉన్నవారికి డీసీసీ అధ్యక్ష పదవులు ఇవ్వబోమని చెప్పిన విషయం వాస్తవమే. కానీ.. ఆ పరిధిలోకి ఎమ్మెల్యేలు రారు. వారిలోనూ అన్ని అర్హతలు ఉన్నఎమ్మెల్యేలకే అవకాశం ఉంటుంది. పార్టీ బలోపేతం కోసం అవసరం అనుకున్న చోట ఎమ్మెల్యేలకూ అవకాశం కల్పిస్తాం. వేరే పదవుల్లో ఉన్నవారైతే, వారిని ఆ పదవికి రాజీనామా చేయించి డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తాం. ఎమ్మెల్యేలకు డీసీసీ పదవులను డబుల్ పోస్టులుగా చూడటం లేదు. అలాగే, ఒకే కుటుంబంలో రెండు పదవులు తీసుకోవడంలో తప్పేమీ లేదు. ఏళ్ల తరబడి కాంగ్రెస్ కోసమే కష్టపడేవాళ్లు ఒకే కుటుంబంలో ఉండొచ్చు. అలాంటప్పుడు వాళ్లకు పదవులు వద్దని ఎలా అంటాం? ఉదాహరణకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వంటి వాళ్ల ఇళ్లల్లో రెండు పదవులు వాళ్ల పనికి గుర్తింపుగా వచ్చినవే. ఉత్తమ్ పద్మావతి కూడా డీసీసీ పదవి కోసం దరఖాస్తు చేసినట్టు తెలిసింది. ఈసారి భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. వాటిని అధిష్ఠానం పరిశీలిస్తోంది` అని తెలిపారు. ఈ వ్యాఖ్యలను బట్టి, అనూహ్యంగా ఏఐసీసీ పరిశీలకులు సూచించి, సిఫార్సు చేసిన వారే కాకుండా, ఇతరులు కూడా డీసీసీ పదవులు దక్కించుకునే అవకాశం ఉందని స్పష్టమవుతున్నది. లేదంటే ఏఐసీసీ పరిశీలకులు సిఫార్సు చేసిన వారిలో ఎమ్మెల్యేలు, ఒకే కుటుంబంలో ఇప్ంటికే పదవులు తీసుకున్నవారు కూడా ఉండవచ్చని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి

## బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి ముస్కె రాము



అక్షర దర్బార్, పరకాల: ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న "హలో విద్యార్థి – చలో కలెక్టరేట్" ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి ముస్కె రాము తెలిపారు. గత 22 నెలలుగా ఫీజులు విడుదల చేయక విద్యార్థులను, అధ్యాపకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన విమర్శించారు. విద్యాశాఖను స్వయంగా చూసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్య వైఖరిని విరమించి, వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫీజులు విడుదలయ్యే వరకు బిఆర్ఎస్వి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, చిట్యాల: రైతులు పండించిన పత్తిని ప్రైవేటు వ్యాపారులకు అమ్మకుండా సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. చిట్యాల మండలం శాంతినగర్‌లోని ఆంజనేయ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన, పత్తి తేమ లేకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీఐ కేంద్రాల్లో విక్రయించాలంటే కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ తప్పనిసరి అని తెలిపారు. రైతులకు అన్ని వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## చేపల విక్రయ వాహనం ప్రారంభం

అక్షర దర్బార్, శాయంపేట: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శాయంపేట మండలం మాందారిపేట వద్ద సబ్సిడీపై మంజూరైన చేపల సంచార విక్రయ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. చేపల విక్రయం ద్వారా మత్స్యకారులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915